

ప్రభుత్వ పాఠశాలకు టాయిలెట్ క్లీనింగ్ పరికరాలను అందజేస్తున్న కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

విద్యా వ్యవస్థలో మార్పులు తీసుకొస్తున్నాం

- కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

అమీర్‌పేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపర్చుకోవాల్సిన అవసరం ఉందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. శనివారం బేగంపేటలోని కట్ట మైసమ్మ టెంపుల్, ఓల్డ్ కష్టమ్స్ బస్తీలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఫర్నిచర్‌తో పాటు టాయిలెట్ క్లీనింగ్ మెషీన్లను మాజీ మంత్రి మర్రి శశిధర్‌రెడ్డితో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గణతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపి మాట్లాడారు. విద్యా వ్యవస్థలో అనేక మార్పులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తున్నామని, సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లలో టాయిలెట్ క్లీనింగ్ మెషీన్లను అందజేస్తున్నట్లు కిషన్‌రెడ్డి తెలిపారు.



డైరీని ఆవిష్కరిస్తున్న రామాంజనేయులు, జేసీ రెడ్డి, నక్కా యాదగిరి

నిబంధనలు పాటిస్తే అగ్నిప్రమాదాలను నివారించవచ్చు

- ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి రామాంజనేయులు

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నిబంనధలు పాటించకపోవడంతోనే చాలావరకు అగ్నిప్రమాదాలు జరుగుతున్నాయని ప్రభుత్వ ప్రధాన విద్యుత్ తనిఖీ అధికారి సీహెచ్ రామాంజనేయులు అన్నారు. ఐఎస్ఐ నాణ్యత కలిగిన విద్యుత్ పరికరాలు మాత్రమే వినియోగిస్తే షార్ట్‌సర్క్యూట్ ప్రమాదాలను నివారించవచ్చన్నారు. ఖైరతాబాద్ రెడ్‌హిల్స్ ఫ్యాప్సీభవన్‌లో శనివారం తెలంగాణ ఎస్పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ 2025 డైరీ, క్యాలెండర్‌లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యుత్ వైరింగ్ పనులు లైసెన్స్ పొందిన ఎలక్ర్టీషియన్లతో మాత్రమే నిర్వహించాలని, భద్రత ప్రమాణాల విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్పీడీసీఎల్ కాంట్రాక్టర్స్ వెల్ఫేర్ అసోషియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు జేసీ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎలక్ర్టికల్ లైసెన్సింగ్ బోర్డు సభ్యుడు నక్కా యాదగిరి, నేమాల బెనర్జీ, ఏ.మహేందర్, నామిని వెంకటేష్ నేత, పెద పుల్లారావు, వేణుబాబు, సత్యనారాయణ, వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.



కాన్‌క్లేవ్‌కు హాజరైన మహిళా పారిశ్రామికవేత్తలతో నేరెళ్ల శారద తదితరులు

మహిళా వ్యాపారవేత్తలకు అండగా ఉంటాం

- మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): పారిశ్రామిక రంగంలో మహిళలు విశేషంగా రాణిస్తున్నారని రాష్ట్ర మహిళా కమిషనర్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద అన్నారు. బంజారాహిల్స్ పార్క్ హయత్‌లో వైశ్య బిజినెస్ నెట్వర్క్ (వీబీఎన్) జెడ్ చాప్టర్ అర్గనైజింగ్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన "ఉమెన్ మెగా కాన్‌క్లేవ్"లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఏం రంగంలోనైనా మహిళలకు మహిళా కమిషన్ వెన్నుదన్నుగా నిలుస్తుందన్నారు. వైశ్య కుటుంబాలకు చెందిన మహిళలు గతంలో చిన్నచిన్న వ్యాపారాలకు పరిమితమయ్యేవారని, ఇప్పుడు కార్పొరేట్ తరహా వ్యాపారాలతో పాటు పరిశ్రమల స్థాపన వరకు ఎదగడం ఆనందంగా ఉందన్నారు. ప్రత్యేక అతిథిగా వచ్చిన టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి జ్యోత్స్న తిరునగరి మాట్లాడుతూ.. మహిళలు అన్ని రంగాల్లో రాణించినప్పుడే దేశ ప్రగతి సాధ్యమవుతుందన్నారు. వీబీఎన్ వ్యవస్థాపకుడు ఎమ్మడి శివకుమార్, వీబీఎన్ జెడ్ చాప్టర్ అధ్యక్షుడు శంకర్ మొగుడంపల్లి, అపెక్స్ చైర్మన్ అరుణ్ బిజ్జల, వీబీఎన్ జెడ్ కార్యదర్శి శ్రీనివాస్ కొత్తపల్లి, కోశాధికారి అమృత కొణిజేటి పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బాబూరావు

'హెబ్రోన్ చర్చి వివాదంపై విచారణ జరిపించాలి'

పంజాగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ గోల్కొండ చౌరస్తాలో ఉన్న హెబ్రోన్ చర్చి వద్ద ఇటీవల చోటుచేసుకున్న ఘటనలు, మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వరరావు, పాస్టర్‌లపై జరిగిన దాడిని ఖండిస్తున్నామని జంటనగరాలకు చెందిన క్రైస్తవ సంఘాల నాయకులు అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రిటైర్డ్ ఐపీఎస్ అధికారి డి.బాబూరావు, జోయల్ జశ్వంత్ తదితరులు మాట్లాడుతూ.. వివాదాలు విషయంలో ఇరువర్గాలు మాట్లాడుకుని పరిష్కరించుకోవాలని కానీ దాడులు సరికాదన్నారు. చర్చి వివాదంపై ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి న్యాయ విచారణ జరిపించాలని చర్చి సభ్యులు ఎం.రూబిన్ ఫ్రాన్సిస్, పాస్టర్ జాన్ స్టీవార్డ్, రిచర్డ్ తదితరులు అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం జోక్యం చేసుకొని విచారణ జరిపించాలని వారు కోరారు. దాడి ఘటనపై చిక్కడపల్లి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు.

మ్యాట్రిమోని సైట్‌లో పరిచయం..
పెళ్లి పేరుతో మోసం

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): మ్యాట్రిమోని సైట్‌లో పరిచయమై పెళ్లి చేసుకుంటానని నమ్మించి వ్యక్తి నుంచి డబ్బులు కాజేసిన ఇద్దరిని సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేశారు. తిరుపతికి చెందిన తమ్మ హేమమణి అలియాస్ ప్రీతిరెడ్డి (37), కొండారెడ్డి (42) కలిసి మ్యాట్రిమోని మోసాలకు పాల్పడుతున్నారు. హేమమణి ప్రీతిరెడ్డి పేరుతో ప్రొఫైల్‌ను తయారు చేసింది. తాను వైద్యురాలినని, భర్తతో విడాకులు తీసుకున్నానని నకిలీ వివరాలు పెట్టింది. ప్రొఫైల్ నచ్చడంతో నగరానికి చెందిన వ్యక్తి (45) ఆమెను సంప్రదించాడు. అనంతరం వాట్సాప్‌లో చాట్ చేసుకోవడం, మాట్లాడుకోవడం చేసేవారు. ఆమె ప్రవర్తన నచ్చిన అతడు పెళ్లి చేసుకుందామని అడగడంతో ఆమె అంగీకరించింది. ఆ తర్వాత పేషెంట్లకు ఆపరేషన్, తల్లి చనిపోయింది అంటూ పలు కారణాలతో రూ.4.97 లక్షలు తీసుకుంది. ఈ వ్యవహారంలో కొండారెడ్డి ఆమెకు సహకరించేవాడు. ఇద్దరు కలిసి కాజేసిన డబ్బుతో విలాసాలు చేసేవారు. పెళ్లి ప్రస్తావన తెస్తే డబ్బులు డిమాండ్ చేయడంతో మోసపోయానని గ్రహించిన బాధితుడు సైబర్ క్రైం ఠాణాలో ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు ప్రారంభించిన సైబర్‌క్రైం ఇన్‌స్పెక్టర్ మధులత బృందం తిరుపతిలో ఉన్న హేమమణి, కొండారెడ్డిలను అరెస్ట్ చేశారు.



జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్, సభ్యులు



ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో ప్రతిజ్ఞ చేస్తున్న వైద్యులు, సిబ్బంది

ఓటర్లు ఒత్తిడికి తలొగ్గొద్దు

- బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్
- పలు ప్రాంతాల్లో ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవం

పంజాగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): అర్హులందరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్ సూచించారు. ఎన్నికల కమిషన్ పిలుపు మేరకు శనివారం ఖైరతాబాద్‌లోని రాష్ట్ర బీసీ కమిషన్ కార్యాలయంలో జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన జాతి, మత, కుల, వర్గ, భాష, ఎటువంటి ఒత్తిడిలకు ప్రభావితం కాకుండా ఎన్నికల్లో ఓటు వేస్తామని పలువురితో ప్రతిజ్ఞ చేయించారు. మరి కొద్ది రోజుల్లో దేశ ఓటర్ల సంఖ్య 100 కోట్లకు చేరుతుందన్నారు.

పంజాగుట్టలో..

పంజాగుట్టలోని ప్రేమ్‌నగర్ అంబేడ్కర్ భవన్‌లో శనివారం జాతీయ ఓటరు దినోత్సవ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జీహెచ్ఎంసీ సర్కిల్-18 అర్బన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ (యూసీడీ) ఆశ మాట్లాడుతూ.. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.

ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రిలో..

ఎర్రగడ్డ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ఆలోచించి ఓటు వేయాలని ఎర్రగడ్డ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అనిత రాయిరాల అన్నారు. శనివారం జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాస్పిటల్ సిబ్బంది కుల, మత, వర్గ, ధన ప్రభావాలకు లోనుకాకుండా, ఎలాంటి ఒత్తిడికి తలొగ్గకుండా ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ సుధారాణి, ఆర్ఎంఓ డాక్టర్ పద్మజ, డాక్టర్ వివస్వాన్, డాక్టర్ వెంకటసుబ్బయ్య, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేస్తేనే ప్రభుత్వానికి మనుగడ

- మాజీ మంత్రి మోత్కుపల్లి

పంజాగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తేనే కాంగ్రెస్ ప్రభుత్వం ఉంటుందని, లేదంటే ఉండదని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనలో మాదిగలకు గుర్తింపు లేదన్నారు. మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి(ఎమ్మార్పీఎస్) అధ్యక్షుడు ఎం.పాపయ్య మాదిగ అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సమితి రాష్ట్ర స్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా నర్సింహులు మాట్లాడుతూ.. వర్గీకరణపై సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నామని, సీఎం రేవంత్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన విధంగా వర్గీకరణ చేస్తారనే నమ్మకం ఉందని ఆయన అన్నారు.

అనిల్‌కు వీర తెలంగాణ అవార్డు

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు మెరుగైన సేవలు అందించినందుకు ఎస్‌బీఐ లైఫ్ సీనియర్ అడ్వైజర్ జవ్వాది అనిల్‌కుమార్‌ను వీర తెలంగాణ అవార్డు వరించింది. బంజారాహిల్స్‌కు చెందిన అనిల్‌కుమార్‌కు నగరంలో శనివారం నిర్వహించిన ఎస్‌బీఐ లైఫ్ కార్యక్రమంలో సంస్థ జోనల్ డైరెక్టర్ రాజీవ్ శ్రీవాస్తవ, రీజనల్ డైరెక్టర్ అభిషేక్ ముజేందర్ అవార్డు అందజేశారు.

కేంద్ర ఓబీసీ కులాలను వర్గీకరించాలి

- వకుళాభరణం కృష్ణమోహన్‌రావు



అభివాదం చేస్తున్న వకుళాభరణం కృష్ణమోహన్ రావు, కుమారస్వామి, సమ్మయ్య తదితరులు

పంజాగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): జస్టిస్ రోహిణి కమిషన్ నివేదిక మేరకు కేంద్ర ఓబీసీ జాబితాను కులాలవారీగా వర్గీకరించాలని, జనగణనలో బీసీ కులగణనను చేపట్టాలని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు డిమాండ్ చేశారు.జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుంద్ర కుమారస్వామి అధ్యక్షతన శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో పలు అంశాలపై రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణమోహన్‌రావు మాట్లాడుతూ.. కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ఓబీసీ కులాల జాబితాను గ్రూపులుగా వర్గీకరించి అందుకనుగుణంగా రిజర్వేషన్‌లను అమలుచేయాలని జస్టిస్ రోహిణి కమిషన్ 2023లోనే నివేదిక అందజేసినా కేంద్ర ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దేశంలోని 3500 బీసీ కులాల్లో ఇప్పటికీ వెయ్యి కులాలకు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో కనీస ప్రాధాన్యం లేదని వివరించినప్పటికీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. బీసీ కులగణన చేపడతామని గతంలో అప్పటి హోంమంత్రి రాజనాథ్‌సింగ్ హామీ ఇచ్చినప్పటికీ, ఆ నిర్ణయాన్ని కేంద్రప్రభుత్వం ఎందుకు వెనక్కి తీసుకుందో చెప్పాలని డిమాండ్ చేశారు. దుంద్ర కుమారస్వామి మాట్లాడుతూ.. తమ న్యాయమైన డిమాండ్ల సాధనకు దేశవ్యాప్తంగా బీసీ వర్గాల ప్రతినిధులను కూడగట్టి దశలవారీగా అనేక ఉద్యమాలు చేపట్టనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో బీసీ ఉద్యోగుల ఫెడరేషన్ అధ్యక్షుడు దేవళ్ల సమ్మయ్య, జాతీయ సంచార కులాల సంఘం అధ్యక్షుడు నరహరి, సందీప్, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి, శేషగిరిరావు కుటుంబ సభ్యులు

కళలు మన సంస్కృతిలో భాగం

- గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): కళలు మన సంస్కృతిలో భాగమని, మన ఘన సంస్కృతిని కాపాడుకునే బాధ్యత యువతపై ఉందని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అన్నారు. స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శనివారం "రివైవింగ్ ద రూట్స్" పేరుతో డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు కుంచె నుంచి జాలువారిన చిత్రాల ప్రదర్శనను ప్రారంభించారు. డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు చిత్రకళను మరో స్థాయికి తీసుకెళ్లారని, ఆయన కుంచె నుంచి జాలువారిన చిత్రాలు ఆనాటి పరిస్థితులను కళ్లకు కట్టినట్లు చూపుతాయన్నారు. శేషగిరిరావు చిత్రించిన అరుదైన పెయింటింగ్‌లను భద్రపరిచి ప్రదర్శనకు పెట్టిన ఆయన కుటుంబ సభ్యులను గవర్నర్ అభినందించారు. తమ కుటుంబంలోనూ కళాకారులు ఉన్నారని, తన మామయ్య సైతం చిత్రకారుడేనని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్టేట్ ఆర్ట్ గ్యాలరీ ఆధ్వర్యంలో నిర్వహించే "ఆలిండియా ఆర్ట్ కాంపిటీషన్" పోస్టర్‌ను గవర్నర్ విడుదల చేశారు. స్టేట్ ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ లక్ష్మి మాట్లాడుతూ.. ఆర్ట్ కాంపిటీషన్ 6వ ఎడిషన్‌లో విజేతకు రూ.లక్ష, రెండవ విజేతకు రూ.50 వేలు, మూడవ విజేతకు రూ.20 వేలను అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్నవారు ఫిబ్రవరి 22 నుంచి మార్చి 25 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నేడు ఉచితంగా వినికిడి పరీక్షలు

అమీర్‌పేట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ఏషియన్ ఈఎన్‌టీ ఆస్పత్రిలో నేడు ఉచిత వినికిడి పరీక్షలు నిర్వహించనున్నట్లు ఈఎన్‌టీ సర్జన్ చావా ఆంజనేయులు తెలిపారు. ఆదివారం నిర్వహించనున్న ఉచిత వినికిడి శిబిరంలో ఆడియో, మెట్రీ, బరా టెస్ట్, హియరింగ్ టెస్ట్, కాంక్లియర్ ఇంప్లాంట్‌కు అవసరమైన పరీక్షలు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.

ఎస్సీ వర్గీకరణకు ఆర్డినెన్స్ తీసుకురావాలి

- తెలంగాణ అడ్వకేట్ జేఏసీ



సమావేశంలో అభివాదం చేస్తున్న జేఏసీ నాయకులు, న్యాయవాదులు

పంజాగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో ప్రకటన చేసిన మేరకు ఎస్సీ వర్గీకరణకు వెంటనే ఆర్డినెన్స్ జారీ చేయాలని తెలంగాణ అడ్వకేట్స్ జేఏసీ డిమాండ్ చేసింది. జేఏసీ ఆధ్వర్యంలో శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఎస్సీ వర్గీకరణకు మద్దతుగా సీనియర్ న్యాయవాది కొమ్ము ప్రవీణ్ కుమార్ అధ్యక్షతన సంఘీభావ సభ జరిగింది. ఈ సందర్భంగా హైకోర్టు సీనియర్ న్యాయవాదులు వి.రఘునాథ్, ఎర్ర జగన్, బార్ కౌన్సిల్ సభ్యుడు సునీల్ కుమార్ గౌడ్, జనార్దన్ గౌడ్, మల్లారెడ్డి, నాగుల శ్రీనివాస్ యాదవ్, మంత్రి రవీందర్, చాట్ల మణికుమార్,పోలె విష్ణు తదితరులు మాట్లాడారు. మంద కృష్ణమాదిగ నేతృత్వంలో 30 సంవత్సరాలుగా వర్గీకరణ కోసం పోరాటం జరుగుతోందని, సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయం జరుగుతుందనుకుంటే, ఉద్యమ ఫలాలు అందే సమయంలో అడుగడుగునా అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్గీకరణ జరగకపోవడంతో విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాలలో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. ఫిబ్రవరి 7న మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో తలపెట్టిన లక్ష డప్పులు వేల గొంతులు కార్యక్రమానికి, వర్గీకరణకు తమ పూర్తి మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్ ఉపేంద్ర, బార్ కౌన్సిల్ కార్యదర్శి శాంతిభూషణ్, సహాయ కార్యదర్శి నవీన్ వాసిరెడ్డి, భూపతి తదితరులు పాల్గొన్నారు.

భద్రతపై అవగాహన



జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా శనివారం ఎర్రమంజిల్ రవీంద్ర కేతన్ పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు సేఫ్టీపై అవగాహన కల్పిస్తున్న జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేష్ చిదుర, ఆర్టీఏ అధికారులు

- హైదరాబాద్ సిటీ, (ఆంధ్రజ్యోతి)



సుబ్బారావు చిత్రపటానికి నివాళులర్పించిన నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

నిమ్స్‌లో డాక్టర్ కాకర్ల సుబ్బారావు శత జయంతి వేడుకలు

హైదరాబాద్ సిటీ, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు హయాంలో నిమ్స్ ఆస్పత్రి దేశంలోనే గొప్ప ఆస్పత్రిగా పేరుగాంచిందని పలువురు కొనియాడారు. ప్రముఖ రేడియాలజిస్ట్ నిమ్స్ మాజీ సంచాలకులు పద్మశ్రీ ప్రొఫెసర్ కాకర్ల సుబ్బారావు శత జయంతి వేడుకల సందర్భంగా నిమ్స్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు. అప్పటి సీఎం ఎన్టీఆర్ ఆహ్వానం మేరకు స్వదేశానికి తిరిగివచ్చి నిమ్స్ ఆస్పత్రిలో కార్పొరేట్ వైద్యం అందించి జాతీయ స్థాయిలో నిలబెట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నిమ్స్ డీన్ డాక్టర్ లీజా రాజశేఖర్, ప్రొఫెసర్ జ్యోత్స్నారాణి, డా. ఎన్. కవిత, డా. శ్రీదేవి, డా. సుబ్బలక్ష్మి, డా. సుచంద తదితరులు పాల్గొన్నారు.

ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వ్యక్తులపైకి దూసుకెళ్లిన కారు

- ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు
- యువకుల నిర్లక్ష్యపు డ్రైవింగ్‌తోనే ప్రమాదం
- బంజారాహిల్స్‌లో ఘటన



ప్రమాదానికి కారణమైన కారు

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువకుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఫుట్‌పాత్‌పైకి కారు దూసుకుపోవడంతో అక్కడ నిద్రిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. నిందితులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఈ దారుణం జరిగింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన నగల వ్యాపారి కుమారుడు హర్షవర్ధన్ షార్ట్ ఫిలింలు తీస్తూ హైదరాబాద్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతని స్నేహితుడు రాకేశ్ జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మద్యం తాగి తనను గదికి తీసుకెళ్లాలని హర్షవర్ధన్‌కు ఫోన్ చేశాడు. హర్షవర్ధన్ కూడా మద్యం తాగి ఉండటంతో తన కారును ఇతర స్నేహితులైన సాంకేత్ శ్రీనివాస్, వంశీకి ఇచ్చి పంపాడు. వారు జూబ్లీహిల్స్‌లో రాకేశ్‌ను ఎక్కించుకుని తిరిగి వెళుతుండగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌పైకి దూసుకుపోయి.. రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దాంతో అక్కడ నిద్రిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న శ్రీనివాస్, అతని పక్కనే ఉన్న వంశీ బయటకు వచ్చి పారిపోయారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సింగర్ అర్జున్ విజయ్

వాలీబాల్ టోర్నీ ప్రారంభం

బోయిన్‌పల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): క్రీడా మైదానాలు యువతకు మంచి స్నేహితులను పరిచయం చేయడంతో పాటు క్రమశిక్షణ, మంచి మార్గాన్ని అలవర్చుకోవడానికి దోహదం చేస్తాయని ప్రముఖ ప్లేబ్యాక్ సింగర్ అర్జున్ విజయ్ అన్నారు. బోయిన్‌పల్లి ఓల్డ్ ఎయిర్‌పోర్టు రోడ్డులోని తార హోం గ్రౌండ్‌లో యువజ్యోతి స్వచ్ఛంద సెయింట్ ఆంథోని క్యాథెడ్రల్ సంస్థ ఆధ్వర్యంలో ముత్తూట్ ఫైనాన్స్ సహకారంతో ఎక్యూమెనికల్ వాలీబాల్ టోర్నమెంట్ శనివారం ప్రారంభమైంది. అర్జున్ విజయ్ ముఖ్యఅతిథిగా హాజరై ఈ పోటీలను ప్రారంభించారు. వివిధ జిల్లాల నుంచి వచ్చిన క్రీడాకారులను, కోచ్‌లను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తాను కూడా వాలీబాల్ క్రీడాకారుడు కావడంతో కాసేపు వాలీబాల్ ఆడుతూ క్రీడాకారుల్లో మరింత జోష్ నింపారు. ఈ సందర్భంగా అర్జున్ విజయ్ మాట్లాడుతూ, క్రీడల వల్ల ఫిట్‌నెస్‌తో పాటు క్రమశిక్షణ, ఆటల్లో నైపుణ్యం బయటకు వస్తుందన్నారు. టోర్నమెంట్‌కు వచ్చిన ఫండ్స్‌ను నిర్వాహకులు తార హోమ్ అనాథాశ్రమానికి అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ముత్తూట్ ఫైనాన్స్ ప్రతినిధులు లక్ష్మి, శివ, రెవరల్ ఫాదర్ ఆంథోని మంజు సుంచాయిలతో పాటు యువజ్యోతి ప్రతినిధులు మొబిన్, నిఖిల్, మరియా సాజన్, సోను, జెర్రీస్, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ టోర్నీలో పాల్గొన్న సికింద్రాబాద్ సివిల్ కోర్టు మహిళా న్యాయవాదులు

సందడిగా మహిళా న్యాయవాదుల క్రికెట్ టోర్నీ

అడ్డగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): నాగురపల్లి వెంకట్‌రెడ్డి మెమోరియల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు ఎన్.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.కమల, ఎన్.జనార్ధన్ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం షెనాయ్ ఎదురుగా మున్సిపల్ మైదానంలో సికింద్రాబాద్ సివిల్ కోర్టు మహిళా న్యాయవాదులు క్రికెట్ టోర్నీని నిర్వహించారు. సికింద్రాబాద్ కోర్టు ఫస్ట్ అదనపు చీఫ్ జడ్జి వీరయ్య చేతుల మీదుగా ఈ టోర్నీని ప్రారంభించారు. న్యాయవాదులు నాలుగు జట్లుగా విడిపోయి పోటీల్లో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటల వరకూ సందడిగా సాగిన ఈ టోర్నీ విజేత గా రోరింగ్ టైగర్ టీఎం-ఏ జట్టు నిలిచింది. కార్యక్రమంలో సివిల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు వై.వసంత్ కుమార్, లేడీ రిప్రజెంటీవ్ పుష్పలత, ప్రధాన కార్యదర్శి సుశీల్‌కుమార్, ఉపాధ్యక్షుడు టీవీ రమణ, హిమవర్ణతో పాటు సభ్యులు పాల్గొన్నారు.



ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజును సత్కరిస్తున్న సిబ్బంది

రతన్ టాటా మార్గంలో నడవాలి

● ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు

రాంగోపాల్‌పేట్, జనవరి 25(ఆంధ్రజ్యోతి): తనతో పాటు తన కంపెనీల నికర లాభాల్లో 66 శాతం వివిధ సేవా కార్యక్రమాలకు వెచ్చించిన రతన్ టాటా మార్గంలో మనం కూడా నడవాలని ఉత్తర మండల ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు అన్నారు. ప్రతి ఒక్కరి కుటుంబ ఆర్థిక భద్రత కోసం జీవిత బీమా కల్పించాలనే సంకల్పంతో శనివారం దక్షిణ భారత దేశ వ్యాప్తంగా 'సంకల్ప యాత్ర' పేరిట టాటా ఏఐఏ ఇన్సూరెన్స్ సిబ్బంది ర్యాలీలు నిర్వహించారు. ఇందులో భాగంగా సికింద్రాబాద్ పార్యడైజ్ వద్ద జరిగిన కార్యక్రమానికి ఏసీపీ శంకర్ రాజు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంపాదన గల ప్రతి వ్యక్తి తన కుటుంబ ఆర్థిక భద్రత కోసం తప్పక లైఫ్ ఇన్సూరెన్స్ తీసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తూ ఇతరులుగా కూడా పాటించేలా చేసి రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఏఓ సీహెచ్ యాదగిరి, బ్రాంచ్ మేనేజర్ ప్రసాద్, సహాయ మేనేజర్లు పరమేశ్వర్ రెడ్డి, అశోక్ వర్ధన్, వేణుగోపాల్, చీఫ్ లీడర్లు ఎండీ హబీబ్ మియా, శ్రీనివాసులు, అవినాష్‌లతో పాటు 100 మందికి పైగా అడ్వైజర్లు, లీడర్లు పాల్గొన్నారు.



ఓటర్ల దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేస్తున్న బీజేపీ నాయకులు

జాతీయ ఓటరు దినోత్సవం

బౌద్ధనగర్, జనవరి25(ఆంధ్రజ్యోతి): బౌద్ధనగర్ డివిజన్ న్యూఅశోక్‌నగర్ ప్రభుత్వ పాఠశాల వద్ద శనివారం బీజేపీ నాయకులు జాతీయ ఓటరు దినోత్సవాన్ని నిర్వహించారు. బీజేపీ యువనాయకుడు మేకల హర్షకిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో న్యూఅశోక్‌నగర్ వెల్ఫేర్ అసియేషన్ అధ్యక్షుడు ఓములు, యూసీడీ ఆర్పీ శరణ్య, వాణిశ్రీ, ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయురాళ్లు జయశ్రీ, సంగీత, వార్డు మెంబర్లు భాగ్య, వాణి, భువనేశ్వరి తదితరులు ప్రతి ఒక్కరూ ఓటుహక్కు వినియోగించుకోవాలని ప్రతిజ్ఞ చేశారు.



కలాసీగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలోని బూత్ నంబర్ 3,4,5,6లలో ఓటును సద్వినియోగం చేసుకుంటామని ఓటర్లతో ప్రమాణం చేయిస్తున్న ఎన్నికల సిబ్బంది. కార్యక్రమంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ నాయకుడు సురేష్, జీహెచ్ఎంసీ అధికారి శివకుమార్, సుదాకర్ రెడ్డి తదితరులు.

(రాంగోపాల్‌పేట్ - ఆంధ్రజ్యోతి)

గణతంత్ర శోభ

సికింద్రాబాద్ ప్రాంతం గణతంత్ర దినోత్సవ శోభను సంతరించుకుంది. రిపబ్లిక్ డే నేపథ్యంలో శనివారం క్లాక్‌టవర్‌తో పాటు ముఖ్యమైన కూడళ్లను, ప్రభుత్వ కార్యాలయాలను మువ్వన్నెల జెండా రంగుల విద్యుత్ దీపాలతో అందంగా తీర్చిదిద్దారు.







విద్యుత్ దీపాల కాంతులీనుతున్న క్లాక్‌టవర్, డీఆర్ఎం ఆఫీస్, సంచాలన్ భవన్, రైల్వే స్టేషన్





అధికారులకు సూచనలు ఇస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

సమస్యలను పరిష్కరిస్తున్నా..

●ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

రాంగోపాల్‌పేట్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): ప్రజలు తన దృష్టికి తీసుకొచ్చిన పలు సమస్యలను అభివృద్ధి పనుల ద్వారా పరిష్కరిస్తున్నామని, గడచిన పదేళ్లలో చేసిన అభివృద్ధే దీనికి నిదర్శనమని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. రాంగోపాల్‌పేట్ డివిజన్‌లోని నల్లగుట్ట జే లైన్‌లో రూ. 80 లక్షల వ్యయంతో చేపట్టిన లైబ్రరీ భవన నిర్మాణ పనులను శనివారం ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. నాణ్యతతో సకాలంలో పనులు జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా తలసాని మాట్లాడుతూ, అధికారంలో ఉన్నా లేకున్నా కూడా తాను ప్రజల అవసరాలు తెలుసుకొని పని చేస్తానని అన్నారు. బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు నల్లగుట్ట జే లైన్‌లో శిథిలావస్థలో ఉన్న లైబ్రరీ భవనం స్థానంలో కొత్తగా జీప్లస్ భవనం నిర్మించేందుకు అనుమతి మంజూరు చేశామని, అలాగే, బస్తీవాసుల విజ్ఞప్తి మేరకు కమ్యూనిటీ హాల్ కోసం అదనపు అంతస్తు మంజూరు చేశామన్నారు. బస్తీలోని రోడ్లు అధ్వాన్నంగా తయారయ్యాయని బస్తీవాసులు చెప్పగా, రోడ్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులను తలసాని ఆదేశించారు. అనంతరం సుభాష్ మైదాన్ (పార్క్)ను సందర్శించిన ఎమ్మెల్యే పార్క్‌లో పాత్‌వే నిర్మాణంతో పాటు ఓపెన్ జిమ్, చిల్డ్రన్స్ ప్లే జోన్‌ను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎమ్మెల్యే వెంట గ్రంథాలయ సంస్థ కార్యదర్శి పద్మజ, టీఎస్ఈడబ్ల్యూడీసీ ఈఈ షఫీ, వాటర్ వర్క్స్ జీఎం వినోద్, జీహెచ్ఎంసీ ఏఈ శివకుమార్, హార్టికల్చర్ అధికారి రాజిరెడ్డి, మాజీ కార్పొరేటర్ అతెల్లి మల్లికార్జున్ తదితరులు ఉన్నారు.



డ్రైనేజీ సమస్యను పరిశీలిస్తున్న కోట నీలిమ

మేకలమండి డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తా : కోట నీలిమ

పద్మారావునగర్,జనవరి,25,(ఆంధ్రజ్యోతి): సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జి డాక్టర్ కోట నీలిమ డివిజన్ కాంగ్రెస్ నేతలలో కలిసి శనివారం బన్సీలాల్‌పేట డివిజన్ పరిధిలోని మేలమండి పరిసర ప్రాంతాలలో పర్యటించి స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ...బన్సీలాల్‌పేట, మేలమండిల్లో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేని కారణంగా స్థానికులు తీవ్ర అవస్థలు పడుతున్నారన్నారు. అభివృద్ధి పనులకు అవసరమైన నిధులు మంజూరైనప్పటికీ సకాలంలో పనులను ప్రారంభించకపోవడంతో ప్రజలు సమస్యలను ఎదుర్కొంటున్నారన్నారు. త్వరలోనే డ్రైనేజీ సమస్యను పరిష్కరిస్తామని స్థానికులకు ఆమె హామీ ఇచ్చారు. అంతేకాకుండా సంబంధిత అధికారులకు సమస్యను వివరించి వెంటనే పనులు ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఐతా చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.



ప్రదర్శనలోని ఓ దృశ్యం

ఆకట్టుకున్న మ్యాజిక్ షో

హరిహరకళాభవన్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): గాలిలోంచి రామచిలుకలు, పావురాలు, మంటలు సృష్టించడం...పేక ముక్కలతో విన్యాసాలు.. డ్రగ్స్ వాడొద్దని, ట్రాఫిక్ రూల్స్ పాటించాలనే సందేశాత్మక అంశాలతో కోయంబత్తూర్‌కు చెందిన ప్రముఖ మెజీషి యన్ కె. దయానిధి నిర్వహించిన మ్యాజిక్ షో వీక్షకులను ఆకట్టుకుంది. సికింద్రాబాద్, హరిహరకళాభవన్‌లో శనివారం ఒక గంట 20 నిమిషాల పాటు ఈ ప్రదర్శన కొనసాగింది. 14 మంది కళాకారుల సహాయంతో దయానిధి ఈ షోను నిర్వహిం చారు. భారీ సంఖ్యలో తరలివచ్చిన విద్యార్థులు ఆనం దంగా చప్పట్లు కొడుతూ ప్రదర్శకులను ఉత్సాహపర్చారు. ఆదివారం సాయంత్రం 4 గంటలకు, రాత్రి 7 గంటలకు ఈ ప్రదర్శన ఉంటుందని నిర్వాహకుడు తెలిపాడు.

ఘనంగా 'సంవిధాన్ గౌరవ్ అభియాన్'

తార్నాక, జనవరి 25 (ఆంధ్రజ్యోతి) : డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రచించి 75 సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా బీజేపీ తార్నాక డివిజన్ అధ్యక్షుడు బండారి ఉపేందర్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం లాలాపేటలోని ప్రభుత్వ బాలికల వసతి గృహంలో 'సంవిధాన్ గౌరవ్ అభియాన్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. బీజేపీ మహంకాళి జిల్లా అధ్యక్షుడు శ్యాంసుందర్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై భారత రాజ్యాంగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. బీజేపీ అధిష్టానం ఆదేశాల మేరకు సంవిధాన్ గౌరవ్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. కార్యక్రమంలో బీజేపీ మహంకాళి జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి, స్టేట్ ఎగ్జికూటీవ్ మెంబర్ వెంకటేశ్ గౌడ్, నాగేశ్వర్ రెడ్డి, వీరన్న, పోచయ్య యాదవ్, శ్రీనివాస చారి, వేణు యాదవ్, అనిత పాల్గొన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణంపై హర్షం

సికింద్రాబాద్, జనవరి25(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్ రెండోవార్డు ఇందిరమ్మనగర్ ట్రాన్స్‌ఫారమ్ గల్లీలో సీసీ రోడ్డు నిర్మించినందుకు స్థానికులు వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు జె.రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు. ఇందిరమ్మనగర్ కాలనీవాసుల ఆహ్వానం మేరకు శనివారం ఆయన బస్తీలో పర్యటించారు. ఈ సందర్భంగా రామకృష్ణ మాట్లాడుతూ, గతంలో బస్తీబాట కార్యక్రమంలో పర్యటించినప్పుడు సరైన రోడ్డులేక ఇబ్బందులు పడుతున్నామని బస్తీవాసులు తన దృషికి తీసుకొని రాగా, కొత్త రోడ్డు నిర్మించామని, ఆ రోడ్డుపై నడుస్తుంటే తనకు ఆనందంగా ఉందన్నారు. అనంతరం బస్తీవాసులు రామకృష్ణను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో రెండోవార్డు బీజేపీ అధ్యక్షుడు శ్రవణ్, సీనియర్ నాయకులు మాదారపు అశోక్, చిట్టిబాబు, శ్యామ్, మమత, జైయాదవ్, జగన్, మల్లేష్, ఇర్ఫాన్, రేఖ పాల్గొన్నారు.



రామకృష్ణను సత్కరిస్తున్న కాలనీవాసులు

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్‌డే

తిరుమలగిరి, జనవరి25 (ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయ తిరుమలగిరిలో శనివారం గ్రాండ్ పేరెంట్స్ డే ఘనంగా నిర్వహించారు. చెత్త సేకరణ, నీటి పొదుపు వంటి సందేశాత్మక అంశాలతో ప్రదర్శించిన నాటికలు ఆకట్టుకున్నాయి. విద్యార్థుల ఆట,పాటలు, నృత్యాలతో అలరించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి, హెచ్ఎం సాయి పద్మ, గౌరవ అతిథులుగా మాజీ గ్రంథాలయాధికారిణి వి.అరుణ కమారి, మాజీ టీచర్లు కుమార స్వామి, చిట్టయ్య, మేరీ, రేచల్, హంస వేణి, తాత, అమ్మమ్మ, నాయనమ్మలు పాల్గొన్నారు. గ్రాండ్ పేరెంట్స్‌కు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.



కార్యక్రమంలో పాటలు పాడుతున్న విద్యార్థులు



జాతీయ జెండాను ఆవిష్కరిస్తున్న ఎఫ్‌డబ్ల్యూఓ చైర్మన్ సుదీప్త జహ, బ్రిగేడియర్ రీస్ సింగ్, ఆయన సతీమణి ఐశ్వర్యారాగేష్

ఒక్క రోజు ముందుగానే గణతంత్ర వేడుకలు

బోయిన్‌పల్లి, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): బోయిన్‌పల్లిలోని బైసన్ ఆశా పాఠశాలలో గణతంత్ర దినోత్సవాన్ని ఒక్కరోజు ముందుగానే జరుపుకున్నారు. పాఠశాలలోని దివ్యాంగ విద్యార్థులతో కలిసి మిలటరీ అధికారులు శనివారం వైభవంగా నిర్వహించారు. వేడుకలకు 54వ ఇన్ఫాంట్రీ డివిజన్ మిలటరీ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్గనైజ్ కమిటీ చైర్మన్, బైసన్ ఆశా స్కూల్ అధ్యక్షురాలు సుదీప్త జహ ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. అనంతరం దివ్యాంగ విద్యార్థుల కోసం ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సెన్సారీ మినీ పార్క్‌తో పాటు హైడ్రోథెరపీ సెంటర్‌ను ప్రారంభించారు. నగరానికి చెందిన 12 పాఠశాలలకు చెందిన దివ్యాంగ విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. అనంతరం దివ్యాం గులు జాతీయ సమైక్యత, దేశభక్తి భావంతో కూడిన పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ అందరిలో దేశభక్తి స్ఫూర్తిని నింపారు. ఉత్తమ ప్రదర్శన కనబరిచిన విద్యార్థులకు బైసన్ స్కూల్ అధ్యక్షులు సుదీప్తా జాన్ ప్రత్యేక బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో మిలటరీ ఫ్యామిలీ వెల్ఫేర్ ఆర్గనైజ్ కమిటీ సభ్యులు రీన్ సింగ్, 54వ ఆర్‌టీ బ్రిగేడియర్ రీన్ సింగ్, కర్నల్ ఐశ్వర్యారాగేష్‌తో పాటు మిలిటరీ అధికారుల కుటుంబ సభ్యులు, వివిధ పాఠశాలల ప్రిన్సిపాళ్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దివ్యాంగులతో ఎఫ్‌డబ్ల్యూఓ చైర్మన్ సుదీప్త జహ తదితరులు

ఫుట్‌పాత్‌పై నిద్రిస్తున్న వారిపై దూసుకెళ్లిన కారు

●ఒకరి మృతి, ఇద్దరికి గాయాలు.. నిర్లక్ష్యపు డ్రైవింగే కారణం

● బంజారాహిల్స్‌లో ఘటన

బంజారాహిల్స్, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): యువ కుల నిర్లక్ష్యపు డ్రైవింగ్ కారణంగా ఫుట్‌పాత్‌పైకి కారు దూసుకుపోవడంతో అక్కడ నిద్రిస్తున్న ఓ వ్యక్తి మృతి చెందగా, మరో ఇద్దరు గాయపడ్డారు. నిందితులు కారును అక్కడే వదిలేసి పారిపోయారు. హైదరాబాద్ బంజారాహిల్స్‌లో ఈ దారుణం జరిగింది. నిజామాబాద్ జిల్లాకు చెందిన నగల వ్యాపారి కుమారుడు హర్షవర్ధన్ షార్ట్ ఫిలింలు తీస్తూ హైదరాబాద్‌లో స్నేహితులతో కలిసి ఓ గదిని అద్దెకు తీసుకుని ఉంటున్నాడు. అతని స్నేహితుడు రాకేశ్ జూబ్లీహిల్స్‌లోని ఓ పబ్‌లో మద్యం తాగి తనను గదికి తీసుకెళ్లాలని హర్షవర్ధన్‌కు ఫోన్ చేశాడు. హర్షవర్ధన్ కూడా మద్యం తాగి ఉండటంతో తన కారును ఇతర స్నేహితులైన సాంకేత్ శ్రీనివాస్, వంశీకి ఇచ్చి పంపాడు. వారు జూబ్లీహిల్స్‌లో రాకేశ్‌ను ఎక్కించుకుని తిరిగి వెళుతుండగా బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి సమీపంలో కారు అదుపు తప్పి పక్కనే ఉన్న డివైడర్‌పైకి దూసుకుపోయి.. రెయిలింగ్‌ను ఢీకొట్టి బోల్తాపడింది. దాంతో అక్కడ నిద్రిస్తున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి (40) అక్కడికక్కడే మృతి చెందగా, మరో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. కారు నడుపుతున్న శ్రీనివాస్, అతని పక్కనే ఉన్న వంశీ బయటకు వచ్చి పారిపోయారు. సమాచారం అందుకున్న బంజారాహిల్స్ పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు సమాచారం.



ప్రమాదానికి కారణమైన కారు

సికింద్రాబాద్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతి

అడ్డగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్‌లో గుర్తు తెలియని ఓ వ్యక్తి మృతి చెందాడు. గోపాలపురం పోలీస్ స్టేషన్ ఎస్సై సుబ్బారావు తెలిపిన వివరాల ప్రకారం.. సికింద్రాబాద్ మథర్ థెరీస్సా విగ్రహం వద్ద గుర్తుతెలియని 50 ఏళ్ల వ్యక్తి చనిపోయి ఉండగా గమనించిన స్థానికులు గోపాలపురం పోలీసు లకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని గాంధీ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడు ఎవరనేది ఇంకా తెలియలేదని, ఎవరికైనా అతడి వివరాలు తెలిస్తే నేరుగా గోపాలపురం పోలీసుస్టేషన్‌లో లేదా నంబర్ 8712569004కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్ఐ కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

అక్రమంగా నిల్వ ఉంచిన మందులు స్వాధీనం

అడ్డగుట్ట, జనవరి 25 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ అడ్డగుట్టలోని ఓ గోడౌన్ అక్రమంగా నిల్వ ఉంచిన రూ.2.20 లక్షల విలువైన మందులను నార్కోటిక్ డ్రగ్స్ అధికారులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ కథనం ప్రకారం..అడ్డగుట్ట గంగా జమునా హోటల్ పక్కనే ఉన్న ఓ గోడౌన్‌లో సిద్ధి శ్రీకాంత్ అనే వ్యక్తి ఎలాంటి అనుమతి లేకుండా గత కాలంగా మందులను నిల్వ ఉంచాడు. దీని విశ్వ నీయ సమాచారం అందుకున్న డ్రగ్ అధికారులు శుక్రవారం గోడౌన్‌పై దాడి చేసి రూ. 2.20 లక్షల విలువ చేసే మందులను స్వాధీనం చేసుకున్నారు. అంతేకాకుండా ఆయుర్వేద మందు దేవటోన్ సిరప్‌తో కిడ్నీలో రాళ్లు కరిగిపోతాయని, శతపుష్ప పండు పొడి కోర్డిపోలియో మాత్రలు వాడితే వెంటనే జ్వరం తగ్గిపోతుందంటూ సిద్ధి శ్రీకాంత్ అవాస్తవాలు ప్రచారం చేస్తూ అమాయక ప్రజల్ని మోసం చేస్తున్నట్లు విచారణలో వెల్లడైందని డ్రగ్ ఇన్‌స్పెక్టర్ గోవింద్ తెలిపారు.



స్వాధీనం చేసుకున్న మందులను చూపిస్తున్న అధికారులు

వృద్ధురాలి అదృశ్యం

మారేడుపల్లి, జనవరి 25(ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని ఓ వృద్ధురాలు అదృశ్యమైన ఘటన మారేడుపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్సై లక్ష్మీనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రామంతాపూర్‌లో నివాసముంటున్న బాలమ్మ (82) మారేడుపల్లి సంజీవయ్యనగర్‌లో ఉంటున్న తన మనుమరాలి ఇంటికి ఇటీవల వచ్చింది. శుక్రవారం సాయంత్రం ఇంటి నుంచి బయటకి వెళ్లి తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఆమె కోసం గాలించినా ఆచూకీ తెలియరాలేదు. దీంతో మారేడుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



బాలమ్మ